క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 2 గంటలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్ డేవిడ్ రాజ్ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షత వహిస్తారని, ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీత

గోకవరం: ప్రభుత్వం నిర్దేశించినట్టుగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని సిబ్బంది విజయవంతం చేయాలని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీత అన్నారు. స్థానిక సచివాలయంలో బుధవారం మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. డాక్టర్ సునీత మాట్లాడుతూ మండలంలో 41 బూత్‌ల్లో, ఒక మొబైల్ ట్రాన్స్ మిట్ ద్వారా మొత్తం 6,412 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి చర్యలు చేపట్టామన్నారు. మొత్తం 174 మంది వైద్య సిబ్బంది పాల్గొంటారన్నారు. సిబ్బందికి అవసరమైన మెటీరియల్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, ఎంపీహెచ్‌ఈఓలు శంకర్, డీఎస్ మూర్తి పాల్గొన్నారు.

నేడు పల్స్‌పోలియోపై శిక్షణ

తుని: పల్స్‌పోలియో కార్యక్రమంపై స్థానిక ఏరియా ఆసుపత్రి కొత్త బిల్డింగ్‌లో గురువారం వైద్య సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ వెంకటరావు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణ కార్యక్రమానికి వీరవరపుపేట అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది హాజరు కావాలన్నారు. ఈ శిక్షణలో వచ్చే నెల ఐదున జరిగే జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమం విధివిధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు.

రోగులకు పులిహోర పంపిణీ



రోగులకు పులిహోర పంపిణీ చేస్తున్న వైద్యులు

ప్రత్తిపాడు: సెయింట్ జోసెఫ్ ఆస్పత్రి, ప్రత్తిపాడు సీహెచ్‌సీల్లోని రోగులకు, జాతీయ రహదారిపై ఉన్న శ్రీశారదా వయో వృద్ధ నిలయంలోని వృద్ధులకు వైఎస్సార్ సీపీ నాయకురాలు, యశోదా మహిళా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ధర్మాల సరోజాదేవి బుధవారం పులిహోర, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌సీ ఆర్ఎంఓ కన్యాకుమారి, డాక్టర్ కిరణ్‌కుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

యువతికి న్యాయం చేయాలంటూ ఆందోళన

ఏలేశ్వరం: ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన యువతికి న్యాయం చేయాలంటూ పట్టణంలో బుధవారం ర్యాలీ చేశారు. సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పార్టీ నాయకుడు కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ వినోద్‌మిశ్రా నగర్‌కు చెందిన యువతిని, అదే ప్రాంతానికి చెందిన రవికుమార్ మోసం చేశాడని ఆరోపించారు. యువతికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఏలేశ్వరం: పట్టణంలో పశువులను చంపి మాంసం విక్రయిస్తున్న ఇద్దరిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వాళర వివరాల ప్రకారం స్థానిక కప్పల చెరువు సమీపంలోని శ్మశాన వాటికలో రెండు ఎద్దులను చంపి మాంసం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఉత్తరకంచి గ్రామానికి చెందిన యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధి దేవరపు మాణిక్యాలరావు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

50 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: ధర్మవరం గ్రామంలో స్థానిక సెబ్ పోలీసులు 50 లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేశారు. బుధవారం గస్తీ నిర్వహిస్తున్న సెబ్ పోలీసులకు బైక్‌పై సారా తరలిస్తూ.. పెద్దిపాలెం గ్రామానికి చెందిన చిన్ని కృష్ణ తారసపడ్డాడు. అతడిని అరెస్టు చేసి, 50 లీటర్ల సారా, బైకును స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి సారా సరఫరా చేస్తున్న ఉత్తరకంచి గ్రామానికి చెందిన బస్వా నాగసత్యనారాయణ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసినట్టు సెబ్ సీఐ చిరంజీవి తెలిపారు.

సారా తరలిస్తూ..

జగ్గంపేట: రాజుపూడికి చెందిన దుంగా రాంబాబును నాటు సారా తరలిస్తుండగా అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. అడిషనల్ ఎస్సై వీవీ సుబ్బారావు అతడిని అరెస్టు చేసి, బుధవారం పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు చెప్పారు.



కేజీబీవీలో విద్యార్థినులు వేసిన భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రం



వి.కొత్తూరులో సీఈఓ డాక్టర్ చిన్నారావును జ్ఞాపికతో సత్కరిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



బొద్దవరం హైస్కూల్లో సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు



పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థినులు

విజ్ఞానంతోనే ప్రగతి

- శాస్త్ర, సాంకేతికతతోనే దేశాభివృద్ధి
- సర్ సీవీ రామన్‌కు నివాళులు
- ఘనంగా సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

తుని రూరల్: ఏ దేశాభివృద్ధి అయినా శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే ముడిపడి ఉందని తుని మండలం వి.కొత్తూరులో కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ అమృతవాణి అన్నారు. బుధవారం కేజీబీవీలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సైన్సు ఎగ్జిబిషన్ జరిగింది. భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ ఆవిష్కరించిన సైన్సు నమూనాలు, రామన్ చిత్రాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు సైన్సు ఆవశ్యకతను గుర్తించాలన్నారు. విద్యాబుద్ధులను పరిశోధనలపై కేంద్రీకరించాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. ఆ దిశగా విద్యను కొనసాగించాలని సూచించారు. సీవీ.రామన్ వేషధారణలో విద్యార్థిని ఆకట్టుకుంది. సైన్సు ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



వి.కొత్తూరులోని కేజీబీవీలో విద్యార్థినులు ఏర్పాటు చేసిన సైన్సు ఎగ్జిబిషన్

సైన్సు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా సైన్సు విభాగం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ లాబ్స్ సీఈఓ డాక్టర్ గంట్ల చిన్నారావు అన్నారు. బుధవారం తుని మండలం వి.కొత్తూరు శివారు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.లలిత అధ్యక్షతన జరిగిన జాతీయ సైన్సు దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల విద్యార్థులకు, వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రయోగాల ప్రాముఖ్యం, సైన్సుకు ఉన్న డిమాండ్‌ను వివరించారు. డిగ్రీ విద్యార్థులతో సైన్సు ఎక్స్‌పో నిర్వహించారు. డాక్టర్ చిన్నారావును జ్ఞాపికతో సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు వరప్రసాద్, శ్రీనివాస్, రామ్మూర్తి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు

తొండంగి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇస్రో మాజీ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై, సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి, ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లోనూ సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల ప్రాజెక్టులతో సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. విజేతలకు హెచ్ఎం సీహెచ్ సత్యనారాయణ జ్ఞాపికలు అందజేశారు.

ఆధునిక జీవితానికి పునాది

కోటనందూరు: సైన్స్ ఆధునిక జీవితానికి పునాది వంటిదని, దానిపై విద్యార్థులంతా దృష్టి సారించాలని హెచ్ఎం సీహెచ్ వెంకటరమణ అన్నారు. మండలంలోని బొద్దవరం హైస్కూల్లో బుధవారం జాతీయ సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. తొలుత సైన్స్ పితామహుడు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను సైన్స్ ఉపాధ్యాయులు తిలకించి, వారిని అభినందించారు. విద్యార్థులకు సైన్స్‌పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతీ ప్రదానం చేశారు.

సునీల్‌ను కలిసిన ఏడుకొండలు



చలమలశెట్టి సునీల్‌తో గుల్లా ఏడుకొండలు, ఇతర నాయకులు

గోకవరం: వచ్చే ఎన్నికలలో కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ విజయం ఖాయమని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. కాకినాడలో సునీల్ కార్యాలయంలో బుధవారం ఆయనను ఏడుకొండలు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంటరీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎస్సీసెల్ సమావేశాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

జగ్గంపేట: లక్ష్మీనారాయణ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పెన్నులు, పరీక్ష అట్టలు అందజేశారు. మల్లేపల్లి, నాయకంపల్లి, గోకవరం మండలం మల్లవరం గ్రామాల్లోని విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేశారు.

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ర్యాలీ

తుని రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి మద్దతిస్తున్న పార్టీలను ఓడించాలని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేసే సీపీఐ (ఎంఎల్) లిబరేషన్‌ను గెలిపించాలని పార్టీ నాయకులు కోరారు. బుధవారం ఎస్ఎస్ వెంకటాపురంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. పోరాటాలు ద్వారా సాధించిన భూములను సర్వే చేసి, సాగుదారులకు పట్టాలివ్వాలని అధికారులను కోరినట్టు వారు చెప్పారు.

పేదల అభ్యున్నతికి విశేష కృషి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి వాణి
- శృంగరాయునిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: రాష్ట్రంలో పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ ఆధ్వర్యంలో బుధవారం శృంగరాయునిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తోట నరసింహం, తోట వాణి, తోట రాంజీ, తోట శ్రీనిధి పాల్గొన్నారు. నరసింహం పర్యవేక్షణలో తోట వాణి, శ్రీనిధి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించారు. మరిన్ని సంక్షేమ పథకాలు పొందాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరగా పెద్దకాపు, నకిరెడ్డి సుధాకర్, గంజి శ్రీను, మాధరపు వెంకటరమణ, బొర్ర శాంతిమోహన్, కంటి లోవప్రసాద్, బస్వా శివకృష్ణ, గూడుపు శివ, కోన సత్తిబాబు, వనపర్తి రమేష్, నడిపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.



శృంగరాయునిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న తోట వాణి, తోట శ్రీనిధి

ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

ఏలేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం పట్టణంలో బుధవారం జరిగింది. మున్సిపల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక మూడో వార్డులో వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలని ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. పేద ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వైద్యుడు పాపారావు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు జువ్విన వీరరాఘవమ్మ, జువ్విన వీర్రాజు, సిరిపరపు రాజేష్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

374 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం

ఏలేశ్వరం: ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో 374 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేపట్టడమే ఈ ఏడాది లక్ష్యంగా రైతుల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల పరిధిలోని అధికారులు, సిబ్బందితో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు కోసం ఎకరాకు రైతుకు నాలుగేళ్ల కాలంలో రూ.69,599 సబ్సిడీ లభిస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభం ఆర్జించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లిగంపర్తి, ఏలేశ్వరంల్లోని ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీ ఆయిల్ ఫీడ్ డివిజనల్ అధికారి జగ్దేశ్వర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి ఏ.శ్రీవల్లి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



లింగంపర్తిలో ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

గిరిజనుల ఆర్థికాభివృద్ధే జగన్ లక్ష్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

శంఖవరం: గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. బుధవారం మండలంలోని వేళంగి, ఆవేల్తి, ఓంద్రేగుల, అనుమర్తి గిరిజన గ్రామాల్లో ఎంపీపీ పర్వత రాజుబాబు, సర్పంచ్ మేకల సత్యనారాయణతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధ్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతిపక్షాల నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ, ప్రజలకు మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఈగల విజయదుర్గ, సకురు గుర్రాజు, కూనిశెట్టి మాణిక్యం, గుండు చెంచుబాబు, పార్టీ నాయకులు పర్వత వివేక్, యెడ్ల సత్యనారాయణ, అడపా సోమేష్, కె.లాజర్, గింజాల కొండబాబు, కొండపల్లి అప్పారావు, ఆచంట వెంకటేశ్వరరావు, పడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆవేల్తిలో వరుపుల సుబ్బారావుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

పేదల సంక్షేమమే ఊపిరి

ప్రత్తిపాడు రూరల్: ప్రజల సంక్షేమమే ఊపిరిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. పాదుపాకలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజకు చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఓటు వేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి తమ ప్రభుత్వం సమప్రాధాన్యం ఇచ్చిందన్నారు. తమ ప్రభుత్వానికి రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతల రాజు, ఎంపీటీసీలు ఉమ్మిడి తాతీలు, అన్నిక సత్యవతి, పిల్లా చిన్నా, మొల్లి వీరబాబు, బర్ల నాగరాజు, తుట్టా జమిందార్ తదితరులు పాల్గొన్నారు.



పాదుపాకలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వరుపుల సుబ్బారావు

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

గండేపల్లి: ట్రాఫిక్ నిబంధనలను ఆటో యజమానులు, డ్రైవర్లు కచ్చితంగా పాటించాలని జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పరిమితికి మించి స్కూల్ పిల్లలను తీసుకువెళ్లరాదని, ఆటోకు కుడివైపు భాగంలో గ్రిల్స్‌తో మూసివేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులను తరలించే ఆటోలకు కుడి, ఎడమ, వెనుక వైపు ఎటువంటి స్కూల్, క్యారేజ్ బ్యాగ్‌లను తగిలించరాదని, స్కూల్ పిల్లలను డ్రైవర్‌కు కుడి, ఎడమ వైపు, వెనక వైపు ఉన్న డోర్‌ను ఓపెన్ చేసి కూర్చోపెట్టరాదని పేర్కొన్నారు. డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డ్స్ ఆటోతో పాటు ఉంచాలన్నారు. మితిమీరిన వేగంతో నడపడం, ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయరాదన్నారు. పరిమితికి మించిన పిల్లలను తీసుకువెళుతున్న ఆటోల్లో తమ పిల్లలను పంపించరాదని తల్లిదండ్రులకు సూచించారు. ఆటోల్లో సౌండ్ సిస్టం ఉపయోగించడం వల్ల వెనుక వాహనదారుడు హారన్ మోగించినా, డ్రైవర్‌కు వినపడకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. సౌండ్ సిస్టంను ఉపయోగించరాదని చెప్పారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ

పాల వెల్లువను సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: ప్రభుత్వం మహిళా పాడి రైతుల కోసం చేపట్టిన జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం పాలవెల్లువ కార్యక్రమం జరిగింది. రైతుల వద్ద మార్కెట్ కంటే అధిక ధరకు పాలు కొనుగోలు చేస్తారని, ఆవులు, గేదెల కొనుగోలుకు రుణాలిస్తారని వివరించారు. సొసైటీ అధ్యక్షుడు దాసరి చినబాబు, నాయకులు వరసాల ప్రసాద్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

తొండంగి: మామిడి తోటల్లో చెట్లకు వచ్చే తెగుళ్ల నివారణపై మండలంలోని పీఈ చిన్నాయపాలెంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో తోటబడి కార్యక్రమంలో తుని ఉద్యానవన శాఖాధికారిణి విజయలక్ష్మి రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణ ప్రభావంతో మామిడి చెట్లకు తేనెమంచు పురుగు, తామర పురుగు, పిండినల్లి, పక్షికన్ను వంటి తెగుళ్లు వస్తున్నాయన్నారు. వీటి నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యానవన సహాయకులను రైతులు సంప్రదిస్తే, స్వయంగా తోటల్లో చెట్లను పరిశీలిస్తారన్నారు. వారి సూచనల మేరకు తెగుళ్ల నివారణకు మందులకు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.పద్మవిజయ, గ్రామ సచివాలయ ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

ఏలేశ్వరం: ప్రస్తుతం విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ప్యానల్ అడ్వకేట్ అవసరాల దేవి అన్నారు. లింగంపర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా పలువురికి సహాయం చేయవచ్చన్నారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ఉండాలన్నారు. చదువుపై ఏకాగ్రత కలిగి ఉండడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై మెప్మా సిబ్బందికి అవగాహన

తుని: మెప్మా సిబ్బందికి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఓటుహక్కు, ఈవీఎం, వీవీప్యాడ్ వినియోగంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి వ్యక్తి ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. స్వయం సహాయక ప్రతినిధులంతా ఓటు నమోదు, ఈవీఎం, వీవీ ప్యాడ్ల వినియోగంపై అవగాహన పెంచుకుని, ఓటర్లను చైతన్యపరచాలన్నారు. ఓటుహక్కు ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. డ్వాక్రా మహిళలకు రంగోలీ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

విలియమ్స్ హో సేవలు మరువలేనివి

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

ఏలేశ్వరం: కుట్టు మెషీన్ సృష్టికర్త విలియమ్స్ హోను టైలర్లు ఎన్నటికీ మరువలేరని పలువురు వక్తలు అన్నారు. విలియమ్స్ హో జయంతిని పురస్కరించుకుని పట్టణంలో బుధవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. సాయి టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించారు. వేలాది కుటుంబాల జీవనోపాధికి కారకులైన విలియమ్స్‌హో జయంతిని టైలర్స్‌డేగా జరుపుకోవడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఉపాధి చూపిన ఆరాధ్యుడు

ప్రత్తిపాడు: కొత్తపేట రామాలయం ఆవరణలో దర్జీల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. విలియమ్స్ హో చిత్రపటానికి జిల్లా టైలర్ల సంఘ కార్యదర్శి ఏలూరి వెంకటరమణ పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కుట్టు మెషీన్‌ను రూపొందించి, దర్జీలకు ఉపాధి చూపిన విలియమ్స్‌హో ఆరాధ్యుడని కొనియాడారు. ప్రతి దర్జీ విలియమ్స్ హోను స్మరించుకోవాలన్నారు. నిరుపేద దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టైలర్ల సంఘ అధ్యక్షుడు వెదురుపాక ఆదినారాయణ, నాయకులు మొండి రాంబాబు, రాపర్తి చిన సుబ్రహ్మణ్యం, దొడ్డి శ్రీనివాసు. బొబ్బర రాంబాబు, మాగపాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దర్జీలు

దర్జీలను ఆదుకోవాలి

కోటనందూరు: ఆర్థిక ఇబ్బందులలో కొట్టుమిట్టాడుతున్న దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని మండల నూకాంబికా ప్రైమరీ కోఆపరేటివ్ టైలర్ల సంఘ అధ్యక్షుడు కోటిపల్లి గోవిందు విజ్ఞప్తి చేశారు. స్థానిక నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో టైలర్ల దినోత్సవం నిర్వహించారు. ముందుగా విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోవిందు మాట్లాడుతూ తక్కువ ధరకే మార్కెట్‌లో రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి రావడంతో దర్జీలకు పని లేకుండా పోయిందన్నారు. కుటుంబ పోషణ భారంగా మారిన దర్జీలకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.



ఏలేశ్వరంలో..

ఘనంగా టైలర్ల దినోత్సవం

శంఖవరం: శివదుర్గ టైలర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా టైలర్ల దినోత్సవం జరిగింది. విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు శ్రీకాకుళపు రమణ,నక్కా శ్రీను, వీర్రాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



కోటనందూరులో..

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లిలో గ్రామ టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలను నిర్వహించారు. ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ఉన్న పాదాలమ్మ తల్లి గుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం చేశారు. తొలుత సంఘ వ్యవస్థపక అధ్యక్షుడు గళ్లా చంద్రరావుకు నివాళులర్పించారు.